క్లుప్తంగా

దుర్గమ్మకు కళార్చన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న శాకంబరీ ఉత్సవాల నేపథ్యంలో బుధవారం పలువురు కళాకారులు తమ కళలను ప్రదర్శించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదిక వద్ద బుధవారం ఉదయం పలువురు భక్తులు కోలాటం, అమ్మవారి నామ సంకీర్తన, భజనలు నిర్వహించారు. సాయంత్రం విజయవాడకు చెందిన ఎస్.శివకుమార్ పర్యవేక్షణలో 12 మంది చిన్నారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులకు ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి, ప్రసాదాలను అందజేశారు.

ప్రజా సమస్యలపై కృష్ణయ్య అవిశ్రాంత పోరాటం



మధురానగర్(విజయవాడసెంట్రల్): తుది శ్వాస వరకు ప్రజల సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి సీపీఎం నాయకులు యెర్రుబోయిన కృష్ణయ్య అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబురావు కొనియాడారు. స్థానిక మధురానగర్ పప్పులమిల్లు సెంటర్‌లో బుధవారం యెర్రుబోయిన కృష్ణయ్య సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన కృష్ణయ్య సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ నాయకులు యూవీ రామరాజు, పీ కృష్ణమూర్తి తదితరులు కృష్ణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సంప్రదాయ నృత్య పరిరక్షణలో భాగస్వాములు కావాలి



విజయవాడ కల్చరల్: సంప్రదాయ నృత్య పరిరక్షణలో కళాకారులు భాగస్వాములు కావాలని నాట్యాచార్యుడు భాగవతుల వెంకట్రామ శర్మ అన్నారు. తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి ఆధ్వర్యంలో నాట్యాచారిణి భాగవతల సౌమ్యకు కళారత్న పురస్కారం, గురుపూర్ణిమ సందర్భంగా బుధవారం గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికమీద సౌమ్యకు సత్కారం, నృత్య కార్యక్రమాలను నిర్వహించింది. సభకు అధ్యక్షత వహించిన కళాబంధు గోళ్ళ నారాయణరావు మాట్లాడారు. సత్కార కార్యక్రమంలో సంగీత విద్వాంసుడు కేవీ బ్రహ్మానందరావు, బోడి ఆంజనేయ రాజు, కే డేవిడ్‌రాజు, కమ్ముల రవి శేషకుమార్ పాల్గొన్నారు. సౌమ్య బృందం కూచిపూడి సంప్రదాయంలో పలు అంశాలను ప్రదర్శించింది. నిర్వాహకులు, శిష్యులు ఘనంగా సత్కరించారు.

ర్యాంపు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడ సెంట్రల్): ఎట్టకేలకు నగర పాలకసంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించారు. మురుగుకాలువలను దాటి రోడ్డు వరకు వేసిన ర్యాంపులను బుధవారం తొలగించారు. మురుగు కాలువలను ఇష్టారాజ్యంగా మూసివేయటంతో పాటు రోడ్డు వరకు ఫ్లోరింగ్ చేస్తున్నారు. దీంతో రాకపోకలకు స్థానికులు పడుతున్న అవస్థలు వివరిస్తూ 'సాక్షి' దినపత్రికలో సోమవారం 'కాదేదీ కబ్జా కనర్హం' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన టౌన్‌ప్లానింగ్ సిబ్బంది దావు బుచ్చయ్యకాలనీలోని ర్యాంపును తొలగించారు.

బాబు జీవితమే మోసం

బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ మంత్రి అంబటి, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీఎం చంద్రబాబు అంటేనే మోసం, ఆయన జీవితమే మోసం అని మాజీ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. చంద్రబాబు ఇంటి పేరు నారా కాదని మోసం ఆయన ఇంటిపేరని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం అంబాపురంలోని ఎస్.కన్వెన్షన్ హాలులో బాబు మేనిఫెస్టోను గుర్తు చేస్తూ.. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి, మాజీ మంత్రులు అంబటి రాంబాబు, వెలంపల్లి శ్రీనివాసరావు, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు గౌతం రెడ్డి పాల్గొని తొలుత మహానేత వైఎస్సార్ చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బాబూ ష్యూరిటీ మోసం గ్యారెంటీ అంటూ ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ ఎల్ఈడీ ప్రదర్శన ఇచ్చారు. సభలో అంబటి రాంబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తొలి అడుగే మోసం అన్నారు. కూటమిది సుపరి పాలన కాదని..ఇచ్చిన మాట నిలబెట్టుకుంటే సుపరి పాలన అవుతుందని వివరించారు. పవన్, చంద్రబాబు షణ్ముఖ వ్యూహం అన్నారని, ఇద్దరూ కలిసి పథకాలకు తమది గ్యారెంటీ అన్నారని, కానీ ఇపుడు ఒకరికొకరు గ్యారెంటీ లేకుండా తిరుగుతున్నారన్నారు. జీవితంలో మొదటిసారిగా సీఎం అయిన వైఎస్ జగన్ అమ్మ ఒడి పథకం పెట్టారని.. మూడు సార్లు సీఎం చేసి నాలుగో సారి సీఎం అయ్యేందుకు చంద్రబాబు తల్లికి వందనం అని హామీ ఇచ్చారన్నారు. అంతకు ముందు ఏనాడూ చంద్రబాబు ఇలాంటి పథకం పెట్టలేదన్నారు.



సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమావేశంలో క్యూఆర్‌కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీమంత్రి అంబటి, మాజీ ఎంపీ మోదుగుల, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, గౌతమ్ రెడ్డి, డిప్యూటీ మేయర్ శైలజారెడ్డి



వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి అంబటి, మాజీ ఎంపీ మోదుగుల తదితరులు

కార్యకర్తలే బటన్ నొక్కే పరిస్థితి తెస్తాం: మోదుగుల

విజయవాడ పార్లమెంట్ పరిశీలకులు..మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ గెలిపించిన ప్రజలనే ఓడించిన వ్యక్తి చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డిని చూస్తే ఆరోగ్య శ్రీ, ఎన్టీఆర్‌ను చూస్తే కిలో బియ్యం గుర్తుకు వస్తుందన్నారు. మోసం, వంచన గుర్తుకొచ్చేలా చంద్రబాబు విగ్రహం పెట్టాలన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి వస్తే కార్యకర్తలే బటన్ నొక్కే పరిస్థితి రావాలని ఆకాంక్షించారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజల్లో చైతన్యం తేవాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదిలోనే అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్నారు. పునూరు గౌతం రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు మేక తోలు కప్పుకున్న పులి అని, ఎన్నికల వరకు మేకలాగా.. ఆ తరవాత తోలు తీసి పులిలా ప్రవర్తిస్తాడన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలను, నాయకులను పొట్టన బెట్టుకున్నాడన్నారు. డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ రెడ్డి మాట్లాడుతూ..చంద్రబాబు ఎప్పుడూ వచ్చిన కరువు తాండవిస్తోంది..ఏడాదిలో నా ఇంట్లో మంచి జరిగిందని ఏ కుటుంబం భావించడం లేదన్నారు. విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రవిచంద్ర మాట్లాడుతూ కూటమి 143 హామీలు ఇచ్చి.. ఒక్కటి అమలు చేయలేదన్నారు. కార్పొరేటర్లు ఇసరపు దేవి, కుక్కల అనిత, మల్లీశ్వరి, తిరుపతమ్మ, అలంపూర్ విజయ లక్ష్మి కాలే పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ విజయవాడ సెంట్రల్ సమన్వయకర్త మల్లాది విష్ణు, సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

నగరంలో మోడల్ ఫ్లవర్ మార్కెట్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): హోల్ సేల్, రిటైల్ పూల వ్యాపారులు, వినియోగదారులకు అమోద యోగ్యంగా మోడల్ ఫ్లవర్ మార్కెట్‌ను నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ చెప్పారు. నిబంధనలకు లోబడి హోల్ సేల్ పూల మార్కెట్ వర్తక సంక్షేమ సంఘమే మార్కెట్ నిర్మించుకుని వినియోగించుకోవాలని తెలిపారు. హోల్ సేల్ పూల మార్కెట్ వర్తక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూల మార్కెట్ నిర్మాణంపై బుధవారం కలెక్టరేట్‌లోని ఆయన సమావేశ మందిరంలో మార్కెటింగ్, ఉద్యాన, నగరపాలక సంస్థ, పూల వర్తక సంఘం ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ప్రస్తుతం జీఎస్ రాజు రోడ్డులోని రైతు బజారుకు సంబంధించిన 80 సెంట్ల స్థలంలో హోల్ సేల్ పూల మార్కెట్‌ను నిర్మించాలనే ఆలోచన చేశామన్నారు. రైతు బజార్‌ను తొలగించి ఆ ప్రదేశంలో పూల మార్కెట్‌ను ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. కడియం పూల మార్కెట్‌లో ఏర్పాటు చేసిన మౌలిక వసతులను పరిశీలించి మరింత మెరుగైన సౌకర్యాలతో దేశంలోనే మోడల్ పూల మార్కెట్‌గా నిర్మించేలా ముందుకు వస్తే అనుమతులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని కలెక్టర్ తెలిపారు. మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.రాజాబాబు, జిల్లా ఉద్యానశాఖ అధికారి కె.బాలాజీ కుమార్, నగర పాలక సంస్థ ఎస్టేట్ అధికారి ఎ.శ్రీధర్ హోల్ సేల్ పూల మార్కెట్ వర్తక యాజమానుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సయ్యద్ రఫీ దితరులు పాల్గొన్నారు.



హోల్ సేల్ పూల వ్యాపారులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

13న ఫ్లోర్ పెయింటింగ్ పోటీలు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర విశిష్టతను వివరించేలా పర్యాటక ప్రదేశాల్లో ఫ్లోర్ పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తున్నామని మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా, నగరంలోని ప్రధాన పర్యాటక ప్రదేశమైన బరంపార్కు వద్ద సుందరీకరించే దిశగా ఈ నెల 13వ తేదీన ఈ పోటీలు రెండు కేటగిరీల్లో జరుగుతాయని పేర్కొన్నారు. మొదటి కేటగిరీలో 12 ఏళ్ల కంటే ఎక్కువ వయసున్నవారు నేలపైన పెయింటింగ్ వేయాలని సూచించారు. రెండో కేటగిరీలో 12 ఏళ్ల కంటే తక్కువ వయసుగల పిల్లలు డ్రాయింగ్ షీట్లపై డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్నాలని పేర్కొన్నారు. మొదటి కేటగిరీ విజేతలకు మొదటి బహుమతిగా రూ.10 వేలు, రెండో బహుమతిగా రూ.7500, మూడో బహుమతిగా రూ.5 వేలు, నాలుగో బహుమతిగా రూ.3 వేల నగదు అందిస్తామని వెల్లడించారు. రెండో క్యాటగిరీలో కూడా బహుమతులు అందిస్తామన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు 70751 96840 నంబరు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందిస్తామని తెలిపారు.

చావు బతుకుల్లో ఉన్న బిడ్డను రక్షించండి

చిన్నారి తల్లిదండ్రుల వేడుకోలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): గుండె జబ్బుతో బాధపడుతున్న తమ కుమార్తె చిన్నారి అన్విత (7) వైద్యానికి సహాయం అందించి ఆదుకోవాలని తల్లిదండ్రులు బోయిళ్ల శిరీష, స్పందన్ కుమార్ కన్నీటితో వేడుకుంటున్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం చిట్టినగర్ కేఎల్‌రావునగర్ 6వ లైన్‌లో నివసిస్తున్న ఆ దంపతుల కూతురు చిన్నారి అన్విత రెండేళ్ల నుంచి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో గత నెలలో చెన్నైలోని పద్మావతి హాస్పిటల్‌కు చిన్నారిని తీసుకెళ్లారు. అక్కడి డాక్టర్లు ఎంజీఎం హాస్పిటల్‌కు వెళ్లాలని సూచించినట్లు తల్లి శిరీష బుధవారం మీడియాకు వెల్లడించింది. గుండె మార్పిడి చేయాల్సి ఉంటుందని, రూ.55 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారని వివరించారు. ఈ నెల మూడోవారం లోపల హాస్పిటల్ చేర్పించాలన్నారు. లేని పక్షంలో గుండె నుంచి బ్రెయిన్, కిడ్నీ, లివర్, ఇతర అవయవాలపై ప్రభావం చూపుతాయని డాక్టర్లు స్పష్టం చేశారు. తోచిన ఆర్థిక సాయాన్ని అందించాలని కన్నీటి పర్యంతమయ్యారు. దాతలు 91548 43221 నంబరులో సంప్రదించాలని వేడుకున్నారు.



బిడ్డను రక్షించమంటూ చేతులు జోడించి వేడుకుంటున్న శిరీష, కుమార్

పథకాలు రావటం లేదని ఫిర్యాదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): 28వ డివిజన్ భానూనగర్‌లో బుధవారం 'సుపరిపాలనలో– తొలి అడుగు' కార్యక్రమంలో ఎమ్మెల్యే బోండా ఉమా మహేశ్వరరావు స్థానిక కార్పొరేటర్ వీరమాచనేని లలితతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. తమకు తల్లికి వందనం, పింఛన్‌లు రావటం లేదంటూ పలువురు ఫిర్యాదు చేశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ తల్లికి వందనం, పింఛన్‌లు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వీరమాచనేని కిషోర్, నాయకులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలించి.. యువత భవిష్యత్తుకు బాటలు వేద్దాం

లబ్బీపేట(విజయవాడతూర్పు): డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలించి యువత బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దామని ఈగల్ ఎస్పీ కూచిపూడి నగేష్‌బాబు అన్నారు. ఫిలిం అండ్ టెలివిజన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టీసీసీ), శుభశ్రీ క్రియేషన్స్ రూపొందించిన బెజవాడ చిల్డ్రన్స్ రన్‌వే, టాలెంట్ ఐకాన్‌షో పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. నగేష్‌బాబు మాట్లాడుతూ.. చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి ఈ షోలు దోహదపడతాయన్నారు. నిర్వాహకులను అభినందించారు. ఎఫ్‌టీసీసీ ఇండియా అధ్యక్షుడు చైతన్య జంగా, శుభశ్రీ క్రియేషన్స్ అధినేత ఇమ్మానియేల్ మాట్లాడుతూ.. ఆగస్టు రెండో తేదీన బెంజిసర్కిల్‌లోని ట్రెండ్‌సెట్ మాల్‌లో ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఐదు నుంచి 15 ఏళ్లలోపు చిన్నారులకు ప్రవేశం ఉంటుంది. ముఖ్య అతిథిగా బాలీవుడ్ నటి మధుమితా గుప్తా హాజరవుతారు. బాల్యం నుండే డ్రగ్స్‌ను అరికట్టాలనే థీమ్‌తో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణలో విజయ ఇనిస్టిట్యూషన్స్ అధినేత టి.అర్జునరావు పాల్గొన్నారు.ఆసక్తి ఉన్న చిన్నారులు 89190 60267 నంబరులో సంప్రదించాలని సూచించారు.



చిల్డ్రన్స్ రన్‌వే టాలెంట్ ఐకాన్‌షో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఈగల్ ఎస్పీ నగేష్‌బాబు తదితరులు

మద్యం అక్రమ విక్రేతపై కేసు

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న పోలీసు స్టేషన్ పరిధి ఉడా కాలనీలో బుధవారం అక్రమంగా మద్యం అమ్ముతున్న మహిళపై పోలీసులు కేసు నమోదు చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికుల సమాచారం మేరకు గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు పసల సువర్ణ (40) ఉడా కాలనీలో ప్లాట్ నంబరు 33 వద్ద బాటిల్‌కు రూ.30 రేటు పెంచి బ్రాందీ అమ్ముతుండగా పట్టుకుని మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు

మరింత కట్టుదిట్టంగా పోలీసుల రాత్రి గస్తీ



లబ్బీపేట(విజయవాడ తూర్పు): నగర ప్రజలకు భద్రత, భరోసా కల్పిస్తూ కమిషనరేట్ పోలీసులు రాత్రి గస్తీని మరింత కట్టుదిట్టం చేశారు. ముఖ్యంగా నగరంలో ముమ్మర గస్తీ, అనుమానిత వ్యక్తులు, నంబర్ లేని వాహనాల గుర్తింపు, అక్రమ రవాణాపై పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. ఎక్కడా అసాంఘిక కార్యకలాపాలు, అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని పోలీసులను పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు ఆదేశించారు. దీంతో రాత్రి గస్తీని పోలీసులు మరింత కట్టుదిట్టం చేశారు. ప్రత్యేకంగా పోలీసు బృందాలను, పోలీసు వాహనాలను ఏర్పాటు చేసి ముమ్మరంగా వాహనాల తనిఖీ చేస్తున్నారు. లాడ్జీలు, హోటళ్లు, నిర్జన ప్రదేశాల్లో తరుచూ అణువణువూ క్షుణ్ణంగా సోదాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న ముఖ్యమైన ప్రదేశాల్లో పోలీసు అధికారుల పర్యవేక్షణలో ఆయా పోలీసు స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు తమ సిబ్బందితో రాత్రి గస్తీ నిర్వహిస్తున్నారు. అనుమానిత వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్నారు.

గురు పౌర్ణమికి మందిరాలు ముస్తాబు



మధురానగర్(విజయవాడసెంట్రల్): గురుపౌర్ణమి వేడుకలకు బాబా మందిరాలు ముస్తాబయ్యాయి. ఆంధ్రాషిర్డీ ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిరం, పసుపుతోట శ్రీదత్తసాయి మందిరం, మధురానగర్ శ్రీ భగవాన్ షిర్డీసాయిబాబా మందిరం, అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠం, సత్యనారాయణపురం శివకేశవ దేవాలయం, చుట్టుగుంట శ్రీ కల్యాణ షిర్డీసాయిబాబా మందిరాల్లో ఏర్పాట్లు పూర్తిచేశారు. బాబాకు ప్రత్యేక హారతులు విశేష పూజలు అర్చనలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మందిరాలను విద్యుద్దీపాలు, పూలతో అందంగా అలంకరించారు. గురువారం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.



విద్యుద్దీపాల వెలుగులో ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిరం

పోలీసు సిబ్బందికి కంప్లీట్ హెల్త్ చెకప్

లబ్బీపేట(విజయవాడతూర్పు): పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు ఆస్పత్రుల్లో పోలీస్ సిబ్బందికి కంప్లీట్ హెల్త్ చెకప్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. రోజుకు 250 మంది చొప్పున మొత్తం నాలుగు వేల మంది పోలీసు సిబ్బంది, అధికారులు, హోం గార్డులకు ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. నగరంలోని ఆంధ్రా హాస్పిటల్, మెడ్‌స్టార్, కామినేని, క్యాపిటల్, సెంటినీ, హెల్ప్ హాస్పిటల్స్‌లో సిబ్బందికి కంప్లీట్ హెల్త్ చెకప్ పరీక్షలు నిర్వహించారు. పలు ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలను పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికీ జనరల్ బాడీ హెల్త్ చెకప్, డయాబెటిస్, కిడ్నీ ప్రొఫైల్, లిపిడ్ ప్రొఫైల్, గుండె పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏమైనా ఆరోగ్య సమస్యలున్నట్లు గుర్తించిన వారికి వైద్య చికిత్సల అనంతరం సంపూర్ణ ఆరోగ్యంగా విధులకు హాజరు కావాలని సూచించారు. రోజూ 250 మందికి ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. డీసీపీ కె.జి.వి.సరిత పర్యవేక్షణలో నిర్వహిస్తున్న పరీక్షలకు ఏఆర్ ఏడీసీపీ కె.కోటేశ్వరరావును నోడల్ ఆఫీసర్‌గా సీపీ రాజశేఖరబాబు నియమించారు. ఆరోగ్య పరీక్షలకయ్యే ఖర్చును పోలీస్ కమిషనరేట్ ఫండ్ నుంచి చెల్లించనున్నారు.



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న సీపీ రాజశేఖరబాబు

నేటి నుంచి బెజవాడ బిజినెస్ ఎక్స్‌పో

13వ తేదీ వరకు నిర్వహణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురం భగత్‌సింగ్ రోడ్డులోని నాడార్స్ ఫంక్షన్ హాల్‌లో గురువారం నుంచి ఈనెల 13వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు బెజవాడ బిజినెస్ ఎక్స్‌పో పేరిట, మహిళలు, స్వయం సహాయ సంఘాలు, వ్యాపార, పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గంగరాజు సూర్యకుమారి, కొప్పవరపు ఉమాబలరామ్ తెలియ చేశారు. స్థానిక సత్యనారాయణ పురం నాడార్స్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం బెజవాడ బిజినెస్ ఎక్స్‌పో కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన మహిళలు, స్వయం సహాయక సంఘాలు, వ్యాపారులు, పారిశ్రామిక వర్గాలకు చెందిన వారు తమ ఉత్పత్తులను ప్రదర్శించటంతో పాటు ఉత్పత్తి ధరలకే విక్రయిస్తారన్నారు. మహిళల దుస్తులు, ఫుడ్ ప్రొడక్ట్స్, ఆయుర్వేద ఉత్పత్తులు, పచ్చళ్లు, పొడులతో పాటు ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు. ప్రతి ఏటా తాము ఏర్పాటు చేస్తున్న బెజవాడ బిజినెస్ ఎక్స్‌పోను సందర్శించి మహిళలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు శిష్లా కుసుమ లావణ్య, రాజంపూడి అమూల్య, రాచకొండ లక్ష్మి, కస్తూరి హనుమంతరావు, వాడ్రేవు సుబ్బారావు, కొప్పవరపు బలరామ్, దత్త ప్రసాద్, రాజంపూడి మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.



బెజవాడ బిజినెస్ ఎక్స్‌పో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

బీఎస్ఎన్ఎల్‌కు పూర్వవైభవం తీసుకు రావాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని, బీఎస్ఎన్ఎల్‌కు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ప్రభుత్వం పనిచేయాలని ఆలిండియా బీఎస్ఎన్ఎల్ డీఓటీ పెన్షనర్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు పీ అశోక్ డిమాండ్ చేశారు. స్థానిక చుట్టుగుంట బీఎస్ఎన్ఎల్ భవన్‌లో బుధవారం సాధారణ సమ్మెలో భాగంగా బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ టెలికాం ఎంప్లాయీస్ ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్‌కు నాణ్యమైన 4జీ, 5జీ సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కాంట్రాక్టు వర్కర్స్‌కు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఎస్ఎన్ఎల్‌లో వేతన సవరణ చేయాలని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సర్కిల్ కార్యదర్శి నరేంద్ర రామారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలవల్ల బ్యాంకింగ్, ఇన్‌స్యూ ఆయిల్, స్టీల్, రైల్వే, రక్షణ, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయన్నారు. బీజేపీ ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్ బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు కేఎస్‌సీ బోస్, ఎస్.కృష్ణ బాలాజీ, పీ తాతారావు, వీ రవికుమార్, ఏ నాగేంద్రబాబు, ఎల్.రమేష్ బాబు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ఆలిండియా బీఎస్ఎన్ఎల్ డీఓటీ పెన్షనర్స్ అసోసియేషన్, ఆలిండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఎగ్జిక్యూటివ్ పెన్షనర్స్ అసోసియేష్ సభ్యులు పాల్గొన్నారు.



చుట్టుగుంట బీఎస్ఎన్ఎల్ భవన్‌లో నిరసన కార్యక్రమం

నేడు గురుప్రభ నృత్యహేల

విజయవాడ కల్చరల్: హంసధ్వని నృత్యాలయ ఆధ్వర్యంలో గురువారం జీవీఆర్ సంగీత కళాశాలలో వ్యాసపూర్ణిమ సందర్భంగా గురుప్రభ కార్యక్రమం నిర్వహిస్తునట్లు కోఆర్డినేటర్ నిహారిక తెలిపారు. దుర్గాపురంలోని జీవీఆర్ సంగీత కళాశాలలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. కూచిపూడి సంప్రదాయ నృత్య అధ్యాపకుడు డాక్టర్ అజయ్ కుమార్‌కు ఆయన శిష్య ప్రశిష్యులు 200 మందితో గురు సత్కారం నిర్వహిస్తునట్లు తెలిపారు. గురువుకు నృత్య నీరాజనం కార్యక్రమం ఉంటుందన్నారు. జీవీర్ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ కుందుల లక్ష్మీనరస్మ, భాషా సాంస్కృతిక శాఖ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొంటారని వివరించారు.